క్లుప్తంగా

ఎమ్మెల్యే ఆర్కేకు రాఖీ కట్టిన అడిషనల్ కమిషనర్



తాడేపల్లిరూరల్: మంగళగిరి- తాడేపల్లి నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)కు రాఖీ కట్టి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా అడిషనల్ కమిషనర్ హేమమాలిని పలువురు అధికారులకు రాఖీలు కట్టారు. తాడేపల్లి వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు అప్పికట్ల సంపూర్ణపార్వతి మంగళగిరిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆర్కేకు రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

పేరుకలపూడిలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పేరుకలపూడి, గొడవర్రు గ్రామాల్లో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి శిరీష మాట్లాడుతూ ప్రస్తుతం వరి పైరు 30-40 రోజుల మధ్య ఉందని వరి పంటకు ఎటువంటి చీడపీడలు లేవని అన్నారు. రైతులు వేప సంబంధిత మందులను స్ప్రే చేయడం ద్వారా ఆకు ముడత, కాండం తొలిచే పురుగులను నివారించవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ ఎ.రమేష్‌బాబు, గ్రామ వ్యవసాయ అధికారులు పవన్, వంశీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని కాజ గ్రామానికి చెందిన మహిళ కుటుంబానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అందించిన రూ.10వేల సాయాన్ని బుధవారం అందించారు. కార్యక్రమంలో దొంతా కుమారి, మేడా రామయ్య పాల్గొన్నారు.

జగనన్న పాల వెల్లువ రుణమేళా

ఫిరంగిపురం: మండలంలోని మేరికపూడి, పొనుగుపాడు, బేతపూడి, మునగపాడు గ్రామాల్లో జగనన్న పాల వెల్లువ రుణమేళా బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా మెంటార్ పశువైద్యాధికారి పీర్ అహ్మద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పశుసంవర్ధకశాఖ మరియు నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ ద్వారా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 10వేల 343 మంది పాడి రైతుల పేర్లు జగనన్న పాలువెల్లువ కింద రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు పేర్కొన్నారు. రూట్ ఇంచార్జి తులసీబ్రహ్మం, ఏపీఎం సుజాత, కోఆపరేటివ్ బ్యాంకు మేనేజర్ పవన్ పాల్గొన్నారు.

లైంగిక దాడులను ధైర్యంగా ఎదుర్కోవాలి

గుంటూరు లీగల్: బాలబాలికలు తమపై జరుగుతున్న లైంగిక దాడుల్ని ధైర్యం ఎదుర్కోవాలని, దురాగతాల్ని వెంటనే స్థానిక ఎంఈవో లేదా వారి పాఠశాల ఉపాధ్యాయులకు తెలియజేయాలని గుంటూరు వెస్ట్ ఎంఈవో జ్యోతి కిరణ్ సూచించారు. హైకోర్టు ఆదేశాల మేరకు డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో స్తంభాలగరువులోని చేబ్రోలు మహాలక్ష్మి, పుల్లయ్య మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూలులో బుధవారం విద్యార్థులకు బాలల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంఈవో జ్యోతి కిరణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లిపెద్ది శ్రీనివాసరావు సభకు అధ్యక్షత వహించారు. ఎంఈవో జ్యోతికిరణ్ మాట్లాడుతూ బాలలు ఆత్మవిశ్వాసంతో జీవిస్తూ, ఆత్మరక్షణ చేసుకోవాలని సూచించారు. బచపన్ బచావో కో-ఆర్డినేటర్ తిరుపతిరావు మాట్లాడుతూ ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తున్నారని అర్థం చేసుకున్న వెంటనే అరవడం లేదా చుట్టుపక్కల వారికి చెప్పాలని సూచించారు. ఏఎస్ఐ బేబీ రాణి మాట్లాడుతూ పిల్లలు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. డీఎల్ఎస్ఏ ప్యానల్ అడ్వకేట్ అనిల్‌కుమార్ పిల్లలకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లీగల్ కమ్ ప్రొహిబిషన్ అధికారి వాసంతి, పఠాన్ మొహిద్దీన్ ఖాన్, పారా లీగల్ వలంటీర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయలో కళాఉత్సవ్ పోటీలు

గుంటూరు రూరల్: నల్లపాడు కేంద్రీయ విద్యాలయలో హైదరాబాద్ రీజియన్ కేంద్రీయ విద్యాలయాల కళా ఉత్సవ్ కార్యక్రమాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ 2023 క్లస్టర్ స్థాయి కళ, నృత్యం, సంగీత పోటీలను నిర్వహించారు. విద్యార్థుల ప్రతిభను చాటేందుకు క్లస్టర్ స్థాయి 3డీ ఆర్ట్, గ్రూప్, సోలో డ్యాన్స్, డ్రామా, క్లాసికల్, సంప్రదాయ, జానపద సంగీతం, పెయింటింగ్, బొమ్మల తయారీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో తొమ్మిది కేంద్రీయ విద్యాలయాల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రదర్శనలను 15 మంది ప్రముఖ న్యాయనిర్ణేతలు పర్యవేక్షించి విజేతలను ఎంపిక చేశారు. విజేతలను ప్రశంసాపత్రాలతో సత్కరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ హనీ మెహత, హెచ్ఎం ఆనంద్, సునీల, టి.లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

ఎంటీఎంసీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థతో పాటు మంగళగిరి నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేస్తున్నామని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి విస్తృతంగా పర్యటించారు. ఆర్కే మాట్లాడుతూ మంగళగిరి పట్టణంలో ప్రధాన రహదారి అయిన గౌతమబుద్ధ రహదారి విస్తరణ పనులతో పాటు బీటీ రోడ్ నిర్మాణం పూర్తయిందని, పూర్తి స్థాయిలో ఆ రహదారిని అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంగళగిరి నగరపాలక సంస్థ ఏర్పడిన నాటి నుంచి అనేక ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించామని, నిర్మించిన ప్రతి రహదారికి చరిత్ర గుర్తుంచుకునే విధంగా మహనీయుల పేర్లు పెడుతున్నామని పేర్కొన్నారు. ఆనాడు దివంగత నేత, ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పరిపాలనలో మంగళగిరి మున్సిపాలిటీగా ఉన్నపుడు నిర్వహించిన కాలచక్ర కార్యక్రమాన్ని పురస్కరించుకుని అప్పటి గ్రాంటెడ్ రోడ్ గౌతమ్‌బుద్ధ రోడ్‌గా నామకరణం చేయడం జరిగిందని చెప్పారు. నేడు సుమారు 180 మీటర్ల వెడల్పుతో నిర్మించిన నూతన రహదారిలో గౌతమ బుద్ధుని విగ్రహం లేకపోవడాన్ని గుర్తించి నగర ప్రజలు మరియు ఇతరుల సూచనలు, సలహాలు తీసుకుని ఎన్ఆర్ఐ హాస్పిటల్ వద్ద కార్పొరేషన్ స్థలంలో త్వరలోనే గౌతమ బుద్ధుని విగ్రహ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. అనంతరం మన్నెం బజారులో జరుగుతున్న అభివృద్ధి పనులు, కొండపై ఉన్న గండాలయ్యస్వామి దేవస్థానం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులు, నరసింహస్వామి దిగువ దేవస్థాన గుడి పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. పాత మంగళగిరి ఎస్సీ కాలనీ వాసులు పాత మంగళగిరి బైపాస్ సర్వీస్ రోడ్డు వద్ద నుంచి ఎస్సీ కాలనీకి వెళ్లే రహదారి వద్ద డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ ముఖద్వారం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఆర్కేకు, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమాల్లో డీఈలు కృష్ణారెడ్డి, రెహమాన్, ఏఈ కిషోర్, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం గుంటూరు జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, ఎండీ ఫిరోజ్ పాల్గొన్నారు.



స్విమ్మింగ్‌పూల్ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

త్వరలో స్విమ్మింగ్‌పూల్, స్కేటింగ్ రింగ్ ప్రారంభం

తాడేపల్లిరూరల్: కార్పొరేషన్ పరిధిలోని స్విమ్మింగ్, స్కేటింగ్ ప్రేమికులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు శుభవార్త చెప్పారు. త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఆత్మకూరులో వాటర్‌ప్లాంట్ వద్ద నిర్వహిస్తున్న స్విమ్మింగ్‌పూల్, స్కేటింగ్ రింగ్ పనులను బుధవారం పరిశీలించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ తెనాలి- మంగళగిరి రహదారిలో ఆత్మకూరు పంప్‌హౌస్ వద్ద నిర్మిస్తున్న స్కేటింగ్, స్విమ్మింగ్‌పూల్ నిర్మాణ పనులు తుదిదశకు వచ్చాయని చెప్పారు. సెప్టెంబర్ 5వ తేదీ నాటికి పనులు పూర్తి అవుతాయని వివరించారు. నగర ప్రజలు స్విమ్మింగ్ పూల్ లేక ఈత నేర్చుకోవడానికి వందల సంఖ్యలో యువతీ యువకులు కాలువలకు, నదికి వెళ్లి ఈత రాక మృత్యువాత పడుతున్నారని పేర్కొన్నారు. ఈత నేర్చుకోవాలని కుతూహలంతో నీళ్లలోకి దిగుతారని, మరణాలను తగ్గించేందుకు నగరపాలక సంస్థ ప్రజలకు అందుబాటులోకి స్విమ్మింగ్‌పూల్‌తో పాటు స్కేటింగ్ రింగ్‌ను తీసుకువస్తున్నామని, రెండింటికి కలిపి కార్పొరేషన్ సుమారు 1.25 ఎకరాల స్థలాన్ని కేటాయించిందని, రూ.4.70 కోట్లతో వీటిని నిర్మాణం చేపట్టారని వివరించారు. నామమాత్రపు ఫీజులు వసూలు చేస్తూ అనుభవజ్ఞులైన కోచ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం అక్కడే నిర్మాణం జరుగుతున్న గుమ్మడి పుల్లారావు పవర్ లిఫ్టింగ్ మెమోరియల్ అకాడమి నిర్మాణ పనులు పరిశీలించారు. స్విమ్మింగ్‌పూల్, స్కేటింగ్ రింగ్ వద్ద చిన్నారులు ఆడుకునేందుకు క్రీడా ప్రాంగణం, పార్కును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

కేఎల్‌యూలో తెలుగు భాషా దినోత్సవం



నగదు బహుమతిని అందజేస్తున్న తెలుగు భాషా పరిరక్షణ సమితి సంచాలకులు నారాయణరావు

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో తెలుగు భాషా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగు భాషా పరిరక్షణ సమితి సంచాలకులు గోళ్ల నారాయణరావు విచ్చేసి, తెలుగు భాషోద్యమ నేత గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్ట్స్ విభాగాధిపతి డాక్టర్ వెంకటేశ్వర కుమార్ మాట్లాడుతూ నిత్య దైనందిన వ్యవహారంలో సామాన్యుడు వాడే భాషనే కావ్యాలలో కూడా వాడాలని సంకల్పించి, దానిని ఒక ఉద్యమంలా నడిపిన వ్యక్తి తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి అని కొనియాడారు. భాషను బతికితే సంస్కృతి బతుకుతుందన్నారు. ఆచార్య పూడిపాటి ఉమానాథ శర్మ మాట్లాడుతూ మనం ఎలాగైతే ఇళ్లు, పొలాలు, వంటలను వారసత్వంగా పిల్లలకు ఇస్తున్నామో సంస్కృతిని, భాషను కూడా అదే విధంగా భవిష్యత్ తరాలకు అందించాలని అన్నారు. పోటీ ప్రపంచంలో పడి అమ్మబాషను మరచిపోకూడదన్నారు. ఈ సందర్భంగా తెలుగు భాష సాహిత్యాలపైన వ్యాసరచనలతో పాటు బహుళైచ్ఛిన ప్రశ్నలతో పోటీలు నిర్వహించారు. అత్యంత ప్రతిభ కనబరిచిన బీటెక్ విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రెండు వేల రూపాయలు, ద్వితీయ బహుమతిగా వెయ్యి రూపాయలు నగదు అందించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంహెచ్ఎస్‌డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు, డెప్యూటీ విభాగాధిపతి డాక్టర్ కె.అనిల్ కుమార్, డాక్టర్ సాయి కుమార్ పాల్గొన్నారు.

పవర్‌లిఫ్టర్ సాదియాకు సన్మానం



ఇంటర్నేషనల్ పవర్‌లిఫ్టర్ సాదియాను సత్కరిస్తున్న నూతక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి రూరల్ నూతక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టర్ షేక్ సాదియా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ అధ్యక్షుడు బి.రాజీవ్ రత్నం మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మంగళగిరి నియోజకవర్గంలో ఉన్న జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలలో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులందరూ వ్యాయామ విద్య, జాబ్ చార్ట్, యోగా, ఆరోగ్యం మొదలైన అంశాలపై చర్చించామని తెలిపారు. ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టర్ షేక్ సాదియాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ఇన్‌ఛార్జి కె.రజనీనాయక్, ఎన్.రవి, బి.రమేష్ బాబు, ఎం.రవి, డి.భాస్కరరావు, బాల త్రిపుర సుందరి, మంజులత, రాధిక, పద్మ, సాంబశివరావు పాల్గొన్నారు.

కరకట్ట రోడ్డు మరమ్మతులు చేయిస్తాం..



పెదకొండూరు గొడవర్రు కరకట్టను పరిశీలిస్తున్న దుగ్గిరాల జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణ

తాడేపల్లిరూరల్: రేపల్లె- విజయవాడ కనకదుర్గ వారధి మధ్య పెదకొండూరు గొడవర్రు మధ్య కరకట్ట రోడ్డును రలోనే నిర్మిస్తామని దుగ్గిరాల జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణ అన్నారు. కరకట్ట రోడ్డును బుధవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రెండు గ్రామాల మధ్య కరకట్ట రోడ్డు గోతులు పడింది వాస్తవమేనని, గతంలో రేపల్లె కరకట్ట రహదారిని బీటీ రోడ్ నిర్మించగా, ఈ రెండు గ్రామాల మధ్య నిర్మాణం ఆగిపోయిందని, గతంలో గోతులు పడిన సమయంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చొరవతో ఆ గోతులు పూడ్చినట్లు వివరించారు. ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకువెళ్లి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. ఆమె వెంట బుధవారం మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, ఎంపీటీసీ సభ్యుడు కొండూరు సుమన్, నాయకులు శేషయ్య, పెండ్యాల సంసోనమ్మ, కిషోర్ కుమార్, రుబేన్ ఉన్నారు.

కనకపుట్లమ్మ ఆలయ ట్రస్ట్ బోర్డు ప్రమాణస్వీకారం



కనకపుట్లమ్మ అమ్మవారి ఎదుట ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన ట్రస్ట్ బోర్డు సభ్యులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పెదకొండూరు కనకపుట్లమ్మ తల్లి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పి.సిహెచ్.శ్రీనివాసులు సభ్యులతో ప్రమాణం చేయించారు. నూతన కమిటీ చైర్మన్‌గా మొలబంటి శ్రీరామమూర్తి, సభ్యులుగా పిరాట్ల పరశురామారావు, బెల్లంకొండ శ్రీనివాసరావు, నిస్సంకర గోపి, పట్టేల అన్నపూర్ణ, కొండూరు విజయ్‌కుమారి, కాకాని నాగ తిరుపతమ్మ ప్రమాణం చేశారు. అనంతరం ఆలయ అర్చకులు లక్ష్మీపంత్ వేదమంత్రాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజీ, ఆలయ కార్యనిర్వహణాధికారి అనపాల శ్రీనివాసరావు, సర్పంచి మదర సౌజన్య, వైఎస్సార్ సీపీ నాయకులు బర్మా అర్జునరావు, శృంగారపాటి రత్నం, కొండూరు సుమన్, కొరిటాల సురేష్, గమిడిసాయి, ఏమినేని ధనుంజయ, ఉప్పాల సుబ్బారావు, కొండూరు సుబ్బారావు, కాకాని సాంబశివరావు, కమ్మెర శ్రీనివాసరావు, ఆళ్ల హనుమంతరావు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ఓనం వేడుకలు



ఓనం సంప్రదాయ దుస్తుల్లో సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో ఓనం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ కె.ఆర్.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోని కేరళలో జరుపుకునే అతిపెద్ద పండుగ ఓనం అని అన్నారు. ఈ పండుగ కేరళ యొక్క ఆచార వ్యవహారాలతో పాటు వారి సంప్రదాయానికి అద్దం పడుతుందన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్. హనుమంతరావు, డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, అసోసియేట్ డీన్, కేఎల్ ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ రూతు రమ్య, డాక్టర్ సోని, సీఎస్ఈ రెగ్యులర్ విభాగాధిపతి డాక్టర్ టి.పవన్‌కుమార్, సీఎస్ఈ హానర్స్ విభాగాధిపతి డాక్టర్ సెథిల్ మురుగన్, డెప్యూటీ విభాగాధిపతి డాక్టర్ శాంతిశ్రీ పాల్గొన్నారు.

సమరభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



సమరభేరిని జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమరభేరి ప్రచార కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో నిర్వహించిన కార్యక్రమానికి పాశం రామారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత ధరలను విపరీతంగా పెంచి ప్రజలపై భారం వేసిందని అన్నారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేటర్ సంస్థలకు దారాదత్తం చేస్తోందని మండిపడ్డారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్యాస్ సిలెండర్‌పై 200 రూపాయలు తగ్గించినట్లు ఆరోపించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వరరావు, నాయకులు వేముల దుర్గారావు, అమ్మిశెట్టి రంగారావు, పల్లె కృష్ణ, బత్తుల సంసోను పాల్గొన్నారు.

సమరభేరి ప్రచార పోస్టర్ విడుదల

ఫిరంగిపురం: మండలంలోని పొనుగుపాడు గ్రామంలో బుధవారం సీపీఎం సమరభేరి ప్రచార పోస్టర్‌ను బుధవారం విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్ఎం వలి పాల్గొన్నారు.

డాక్టర్ సుబ్బారావు సేవలు ఆదర్శనీయం

గుంటూరు మెడికల్ : జిల్లా లెప్రసీ అధికారిగా డాక్టర్ బి.సుబ్బారావు సేవలు ఆదర్శనీయమని డీఎంహెచ్‌వో డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. డాక్టర్ బి.సుబ్బారావు పదవీ విరమణ సభను బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన సేవల్ని కొనియాడారు. ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం డాక్టర్ సుబ్బారావు దంపతులను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీపీఎంవో డాక్టర్ సీహెచ్.రత్న మన్మోహన్, వైద్య అధికారి డాక్టర్ లక్ష్మానాయక్, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయనన్, ఇతర వైద్యాధికారులు, డీపీఎంవోలు, ఏపీఎంవోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్ధరాత్రి మద్యం అమ్మితే కఠిన చర్యలు

పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రులు మద్యం అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తపేట పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వో షేక్ అన్వర్ బాషా స్పష్టం చేశారు. సాక్షి లో బుధవారం ప్రచురితమైన అర్ధరాత్రులు బార్‌లు తెరిచారు₹ అనే కథనానికి స్పందించారు. కొత్తపేట పీఎస్‌లో బుధవారం సాయంత్రం బార్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్ఓ అన్వర్ బాషా మాట్లాడుతూ నియమ, నిబంధనలకు విరుద్ధంగా రాత్రి 11 గంటల తరువాత మద్యం విక్రయాలు జరిపితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉదయం కూడా ప్రభుత్వం సూచించిన సమయంలోనే బార్‌లు తెరవాలని తేల్చి చెప్పారు. దీంతోపాటు మైనర్‌లకు మద్యం విక్రయిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. పూర్తి స్థాయిలో నిబంధనలకు లోబడి వ్యాపారాలు నిర్వహించాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బార్ల పరిసర ప్రాంతాల్లో ఘర్షణలు, వివాదాలకు తావు లేకుండా యాజమాన్యం చూసుకోవాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ రాత్రి 11 గంటలకు బార్‌లు మూసివేయాలని ఆయన ఆదేశించారు.

శివనాగిరెడ్డికి ప్రతిభా పురస్కారం

తెనాలి: వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్న ప్రముఖులకు హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం బుధవారం 2021 సంవత్సరానికి ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేసింది. ఇందులో భాగంగా తెనాలికి చెందిన ప్రముఖ స్థపతి డాక్టర్ ఈమని శివనాగిరెడ్డికి, శిల్పకళారంగంలో ప్రతి భా పురస్కారం బహూకరించింది. శిల్పకళలో శిక్షణ పొంది అనేక ప్రాచీన ఆలయాల పునరుద్ధరణ, కొత్త ఆలయాల నిర్మాణంలో గత 45 ఏళ్లుగా చేస్తున్న కృషికి ఈ గుర్తింపును అందజేశారు. విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెళ్ల కిషన్‌రావు అధ్యక్షత వహించిన సభలో ఎస్వీ యూనివర్శిటీ మాజీ కులపతి, ప్రసిద్ధ సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్ చేతులమీదుగా శివనాగిరెడ్డికి పురస్కారం ప్రదానం చేశారు.

వీరభద్రస్వామి ఆలయ పునఃప్రతిష్టా మహోత్సవం



ప్రతిష్ఠలో భాగంగా కలశ స్థాపన నిర్వహిస్తున్న వేద పండితులు



ప్రత్యేక పూజలలో పాల్గొన్న భక్తులు

తాడికొండ: తాడికొండలో నూతనంగా నిర్మించిన భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయ జీర్ణోద్ధరణ సహిత పునః ప్రతిష్టా మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 10:30 గంటలకు ధనిష్టా నక్షత్రయుక్త తులా లగ్న పుష్కరాంశ శుభ ముహుర్తంలో వేదపండితులు ఆలయ ప్రతిష్టా మహోత్సవాన్ని భక్తజన సందడి నడుమ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో బింబ ప్రతిష్ఠ, మహా మంగళ పూర్ణాహుతి, కుంభాభిషేకం, శాంతి కల్యాణం, ఆశీర్వచనం కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు మల్లంపల్లి వంశస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రతిష్టా మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నప్రసాద వితరణలో పాల్గొన్నారు.